# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 13 డిసెంబరు, 2025 | పేజీలు :06


## ఆర్ఎఫ్‌సిఎల్ యూరియాపై కేంద్రానికి ఎంపి లేఖ



**ప్రజాపక్షం/గోదావరిఖని:** రామగుండం ఫర్టిలైజర్ సమస్యలు, యూరియా సరఫరాపై కేంద్రాన్ని మరో సారి అప్రమత్తం చేసినట్లు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖకు మరొసారి లేఖను రాసినట్లు ఎంపీ తెలిపారు. రానున్న సాగు సీజన్ కోసం అవసరమైన యూరియా కేటాయింపు, రవాణా, సరఫరా అంశాలను పరిశీలించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. గత యేడాదిలాగా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎఫ్‌సిఎల్ పునరుద్ధరణలో కాకా వెంకటస్వామి, డాక్టర్ వివేక్ వెంకటస్వామి కీలకపాత్ర పోషించిన విషయాన్ని మరొసారి గుర్తు చేసినట్లు తెలిపారు. కర్మాగారం పూర్తి సామర్థ్యంతో పనిచేయకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి 13 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి చేయాల్సి ఉండగా కేవలం 9 లక్షల టన్నుల యూరియా మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇది వ్యవస్థాపక లోపం, యాజమాన్యం నిర్లక్ష్యానికి ఉదాహరణ అన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ఆర్ఎఫ్‌సిఎల్ యాజమాన్యంతో స్పష్టమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. అదేవిధంగా నోయిడాలోని సంస్థ హెడ్ ఆఫీస్‌ను రామగుండానికి మార్చాలని కోరినట్లు తెలిపారు. కర్మాగారంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కర్మాగారం స్థిరమైన యూరియా ఉత్పత్తి, సరఫరా చేసినపుడే తెలంగాణ రైతులకు కష్టాలు తగ్గుతాయని లేఖ ద్వారా కేంద్ర మంత్రిని కోరినట్లు ఎంపీ వంశీకృష్ణ తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయండి

### ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** అభివృద్ధి సంక్షమానికి ఓటు వేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు కోరారు.గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి, భూపతిపూర్, నరసయ్యపల్లి, బొంతకుంటపల్లి, కందునూరుపల్లి, నారాయణపూర్, చిన్న బొంకూర్, రేగడి మద్దికుంట, అల్లిపూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ సర్పంచ్ అభ్యర్థుల బ్యాలెట్ నమూనాలతో ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని ఓటర్లను కోరారు.ముందుగా సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలోని రామాలయంలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాటుపడు తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాదిరిగా అనేక హామీలను నెరవేర్చుతూ ప్రజల ముంగిటకు తీసుకు రావడం జరుగుతుందన్నారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు అనేక విధాలుగా దోపిడీకి గురయ్యారని చెప్పారు. ధాన్యం కొనుగోలు సెంటర్లలో వడ్ల కోత పేరిట అందినంత దోచుకున్నారని చెప్పారు. తాను ఎలాంటి కోతలు లేకుండా సెంటర్లలో వడ్ల కొనుగోల్లను చేపట్టి రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటున్నామని చెప్పారు. త్వరలోనే రైతులకు సన్న వడ్లకు సంబంధించిన బోనస్ డబ్బులను కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. గ్రామాలలో పక్కా ప్రణాళిక కార్యాచరణతో ప్రజలు కోరిన పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. మాట తప్పే ప్రసక్తి లేదని అన్నారు. అలాగే నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అగ్రభాగంగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మాణానికి నిధులు అందిస్తూ గ్రామాలను సస్యశ్యామలం చేస్తున్నారని పేర్కొన్నారు.గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సర్పంచులుగా గెలిచి మరింత అభివృద్ధికి దోహదపడతారని తెలిపారు.మరో మూడు సంవత్సరాల కాలం ఉందని అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరిస్తానని అన్నారు. అనంతరం కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు, గ్రామాల ప్రజలు, పాల్గొన్నారు.



### ఎన్నికల నియమావళి

# అతిక్రమిస్తే కఠిన చర్యలు



### ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన రోజు నుండి 90 కేసుల్లో 1337 లీటర్ల అక్రమ మద్యం సీజ్

### సిరిసిల్ల డిఎస్‌పి నాగేంద్రచారి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో అక్రమ మద్యం రవాణా,విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. ఎన్నికల సమయంలో హోల్‌సేల్ రూపంలో భారీగా మద్యం అమ్మిన వారిపై ,కొనుగోలు చేసిన వారిపై నిఘా కఠినతరం చేసి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు మొత్తం 90 కేసుల్లో 1337 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు వివరాలు వెల్లడించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని,ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని , ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

### నేటితో రెండో విడత


# ప్రచారం ముగింపు

### డబ్బు, మద్యం, మాంసానికి సమయం ఆరంభం

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండలం గ్రామ పంచాయతీ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. రెండో విడత ఎన్నికల ప్రచారం గడువు శుక్రవారం సాయంత్రానికి ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఓటర్లను ఆకర్షించే విధంగా ఇంటింటికీ తిరుగుతూ మద్దతు కోరుతూన్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల గెలుపు కోసం భారీ ఎత్తున ఖర్చు చేస్తున్నారు. చివరి రోజు భారీ ఎత్తున ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఓటుకు రూ.500 నుంచి 2 వేల రూపాయల వరకు కొన్ని గ్రామాల్లో ఖర్చు చేసేందుకు సర్పంచ్ అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. మందు, బిర్యానీకి నిత్యం పెద్ద ఎత్తున ఖర్చు పెడుతున్నారు. రెండో విడత గ్రామాల్లో ఎన్నికలకు ప్రచారం గడువు ముగుస్తుండటం అభ్యర్థులు సర్వశక్తుల ప్రయత్నాలు చేస్తున్నారు. పోలింగ్ కు ఇంకా రెండు రోజులు సమయం ఉండడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

**నేటితో రెండో విడత ప్రచారంకు ముగింపు....!** జగిత్యాల మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీల్లో ప్రచారం గడువు శుక్రవారంతో గడువు ముగుస్తుండగా అభ్యర్థులు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు కంటే ఎక్కువ ప్రచారం చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులు గెలుపు కోసం ఇంటింటికి తిరుగుతూ ఇక ఉన్న సమయంలోనే ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తూ సర్పంచ్, వార్డులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఒక అవకాశాన్ని ఇవ్వాలని గ్రామాల ప్రజలను కోరుతున్నారు. తమను గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ గెలిపిస్తే ఏ ఏ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ పూర్తి స్థాయిలో ప్రచారంలో నిమగ్నమై ఓట్ల కోసం మద్దతు కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు.

**డబ్బు, మద్యం, మాంసానికి సమయం ఆరంభం :** జగిత్యాల మండలంలో రెండో విడత ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రంతో ముగియడంతో గెలుపు కోసం ఓట్లను కొనేందుకు జగిత్యాల మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. తమకున్న బలబలాలను అంచనా వేసుకుని గెలుపునకు అవసరమైన ఓట్లను కొనేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు ఓటుకు రూ.2వేల వరకు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని సమచారం. బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ సంస్థలపై నిఘా ఉండటంతో తమకు దగ్గరగా ఉన్న బంధువులు, స్నేహితుల ద్వారా డబ్బును సర్దుబాటు చేసుకుంటున్నారని అభ్యర్థుల సన్నిహితులు చెబుతున్నారు. కొంత మంది భూములను, వస్తువులను తాకట్టు పెట్టి డబ్బులు అప్పుగా తీసుకొని ప్రచారానికి ఖర్చు చేస్తున్నారు అని జగిత్యాల మండలంలో సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలలో డబ్బు, మద్యం హవానే నడుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ,నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించడానికి గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు . జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం డిఎస్పీ రఘు చందర్ సూచన మేరకు సీఐ రామ్ నర్సింహారెడ్డి,ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ లెవెల్ పోలీసుల తో కలిసి గొల్లపల్లి ,గుంజపడుగు గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు .ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి ఆ వాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గ్రామాల్లోని ప్రజలందరూ ,నిర్భయంగా స్వచ్ఛందంగా పోలింగ్ లో పాల్గొని తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని ప్రజలకు సీఐ సూచించారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలన్నారు.ఎలాంటి ప్రలోభాలు , బెదిరింపులకు పాల్పడరాదని ప్రజలను హెచ్చరించడమైనది.పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు గ్రామాల్లో అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు .ఈ కార్యక్రమంలో ,సిఐ రామ్ నర్సింహారెడ్డి ,స్థానిక ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ,వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ ,ధర్మపురి ఎస్సై మహేష్ ,బుగ్గారం ఎస్సై సతీష్ ,ధర్మపురి ఎస్ ఎల్ టు రవీందర్ కుమార్ సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## ఎన్‌టిపిసి బలోపేతానికి ఓపెన్ హౌస్ ఇంటరాక్టివ్

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ఎన్‌టిపిసి రామగుండంతెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టులో సంస్థ అన్ని విభాగాల ఉద్యోగులతో శుక్రవారం ఓపెన్ హౌస్ ఫోరం ఇంటరాక్టివ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఈ.డి. చందన్ కుమార్ సమంత, జనరల్ మనేజర్లు, హెచ్‌వోహెచ్‌ఆర్‌లు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, యూనియన్, అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రధానంగా కార్యాలయం మెరుగుదల, సంస్థాగత ప్రభావం తీరుపై ఉద్యోగులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తెలిపిన నిర్మాణాత్మక అభిప్రాయాలను స్వీకరిస్తూ ఈ.డి. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులతోపాటు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్‌టిపిసి సంస్థ బలోపేతానికై ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం ద్వారా అందరిలో ఉత్సాహాన్ని, మరింత ప్రోత్సాహాన్ని నింపిందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

## నిప్పుతో దిగుబడికి ముప్పు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గతంలో వరి పంటలను కొడవళ్లతో మొదళ్ళ దాకా కోసేవారు. రైతులకు పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలు కుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు .అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి . పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు .హార్వెస్టర్ మిషన్ తో వరి పంటలను కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి .జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వరి కోతలను పూర్తి చేసుకున్న రైతులు మళ్లీ దుక్కులను సిద్ధం చేస్తూ వరి నాట్లు వేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు .దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరి కొయ్యలను తగుల బెడుతున్నారు .దీనివల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశముందని ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కోయ్యలను తగుల బెట్టొద్దని వరి కోయ్యలను కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది .ముఖ్యంగా నత్రజని ,ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది .పంటలకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు ,పురుగులు నశిస్తాయి .దీంతో పంట దిగుబడి సరిగా రాదు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి . గడ్డిని నీటితో తడిపి పొలంలోనే కలిపి దున్నడం వల్ల నత్రజని పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు .అలాగే గడ్డిని కాల్చడం ద్వారా దిగుబడి తగ్గి పర్యావరణం దెబ్బ తింటుందని రైతులు గడ్డిని ఇష్టం వచివరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాల గురించి అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తే వారికి మేలు జరుగుతుందని పలువురు అంటున్నారు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగిన సూచనలు ,సలహాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

## హస్త కళలను ప్రోత్సహించాలి: నాగేంద్రశర్మ

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణా రాష్ట్రం చరిత్ర సంస్కృతిలో భాగంగా ఇక్కడి హస్తకళలను ప్రోత్సహించాలని ప్రముఖ చరిత్రకారుడు సంకేపల్లి నాగేంద్ర శర్మ పిలుపు నిచ్చారు. జాతీయ హస్త కళల వారోత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్ మార్కెట్ రోడ్ లో ఉన్న ప్రభుత్వ హస్తకళల విక్రయశాలలో శుక్రవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా శర్మ హాజరయ్యారు. 2023 లో అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్.వి. కణ్ణన్ గారి ఆధ్వర్యంలో కరీంనగర్ మార్కెట్ రోడ్ లో సొంత భవనాలలో ప్రభుత్వ హస్త కళల విక్రయశాల ఏర్పాటైంది. కరీంనగర్ పిలిగ్రి వెండి నగిషీ కళ విశ్వవ్యాప్తంగా పేరు గాంచింది. ప్రధాని ఇటీవల జరిగిన మన్ కీ బాత్ లో ఈ కళాకారుల నైపుణ్యాలను ప్రశంసించారని శర్మ గుర్తు చేశారు. మేనేజర్ ఎన్.శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ గంజి ఉన్నత పాఠశాల కు చెందిన 50 మంది విద్యార్థులు విక్రయశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన పెయింటింగ్, వ్యాస రచన పోటీలలో నెగ్గిన విద్యార్థులకు మేనేజర్ శ్రీనివాస్ జ్ఞాపికలను అందజేశారు. కరీంనగర్ విక్రయశాలలో నిర్మల్ బొమ్మలు, ఇతర ప్రాంతాల కళాకృతులను, ఇత్తడి విగ్రహాలు, నారాయణపేట, పోచంపల్లి లలో తయారు చేసిన వస్త్రలను అమ్మకాలకు ఉంచామని మేనేజర్ శ్రీనివాస్ చెప్పారు. సిబ్బంది అరుణ్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, శ్రీమతి భాగ్యలక్ష్మిలు పాల్గొన్నారు. కరీంనగర్ ఫిలిగ్రి కళాకారులు శ్రీమతి హారిక, ప్రవీణ్ కుమార్ లు ఆహ్వానం మేరకు హాజరై ఫిలిగ్రీ వస్తువుల తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించారు.

## భిక్షాటన లేని నగరంగా రామగుండం




**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండాన్ని బిక్షాటన లేని నగరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ కోరారు. శుక్రవారం స్మైల్ ప్రాజెక్టు సపోర్టు ఫర్ మార్జినలైజ్డ్ ఇండివిద్యువల్స్ ఫర్ లైవ్లిహుడ్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహక సంస్థ శ్రీవినాయక విమెన్(అర్బన్) త్రిఫ్ట్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటి రూపొందించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ద్వారా అమలవుతున్న ఈ ప్రాజెక్టులో భాగంగా యాచక వృత్తిలో ఉన్న వారిని గుర్తించి పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు. మెప్మా ఆధ్వర్యంలో గోదావరిఖని తిలక్‌నగర్ వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉచిత వసతి, భోజనం, వివిధ అంశాల్లో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తారన్నారు. దివ్యాంగులు, అనాథలు, నిరాధరణకు గురైన వారు యాచక వృత్తిలో ఉన్నట్లు గమనిస్తే నేరుగా వారిని పునరావాస కేంద్రంలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, సెక్రటరి ఉమా మహేశ్వర్‌రావు, మెప్మా కోఆర్డినేటర్ మౌనిక, కమ్యూనిటి ఆర్గనైజర్ ఊర్మిళ, రామగుండం పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు, పునరావాస కేంద్రం నిర్వాహకురాలు నూనె లతా మోహన్, శరత్ మోహన్, మమతలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన



**ప్రజాపక్షం/కరీంనగర్:** స్పెషల్ ఇన్ టెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బిఎల్ఓ లు, సూపర్ వైజర్లు ముఖ్య పాత్ర పోషించాలని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతిలో బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో ఓటర్ల జాబితా ప్రక్రియ, ఓటర్ల వివరాల మార్పు చేర్పుల అప్ డేట్, అర్హులను జాబితాలో చేర్చడం, చనిపోయిన వారి తొలగింపు, వెళ్లిపోయిన వారి ఓటర్ల గుర్తింపు, ఓటర్ల దరఖాస్తు స్వీకరణ, ధృవీకరణ తదితర అంశాలపై బిఎల్ఓ లతో సుదీర్ఘంగా చర్చించారు. బిఎల్ఓ వారిగా వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ, స్పెషల్ ఇన్ టెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బిఎల్ఓ లు నిర్లక్ష్యంగా వ్యవహారించరాదని హెచ్చరించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించి, మరణించిన వారి ఓటర్ల జాబితా నుండి తొలగించేలా చర్యలు తీస్కోవాలన్నారు. పోలింగ్ స్టేషన్ వారిగా ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా తనిఖీ చేసి సరైన జాబితా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన నూతన ఓటర్ల దరఖాస్తులను స్వీకరించి ధృవీకరించాలన్నారు. జాబితాలో ఎలాంటి మార్పు చేర్పులు ఉన్నా పూర్తి చేయాలన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో సేకరించి అధికారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఓటర్ల గురించి పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితంగా సమగ్రంగా ఉండేలా చూస్కోవల్సిందిగ బిఎల్ఓల ప్రధాన బాధ్యత అని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ మహేశ్వర్, కొత్తపల్లి ఎమ్మార్వో వేంకట లక్ష్మి, రూరల్ ఎమ్మార్వో రాజేష్, అసిస్టెంట్ కమీషన్ దిలీప్, ఎస్ఈ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ర్యాండమైజేషన్ విధానంలో పోలింగ్ స్టేషన్ల వారీగా ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు వెంకటేశ్వర్లుతో కలిసి ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ తో సమీక్షించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలు నిర్వహించే మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

## ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి ఆన్ డ్యూటీ సౌకర్యం

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఉద్యోగ సంఘాల వినతి మేరకు రెండు లేదా అంతకంటే ఎక్కువ దశల్లో పంచాయతీ ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి పోలింగ్ తదుపరి రోజు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పిస్తూ జిల్లా ఎన్నికల అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. 11, 14, 17 తేదీల్లో జరిగే పంచాయతీ ఎన్నికల్లో ఏవేని రెండు లేదా అంతకంటే ఎక్కువ దశల్లో ఎన్నికల్లో విధులు నిర్వహిస్తేనే ఈ సౌకర్యం వర్తిస్తుంది. 11, 14 తేదీల్లో విధులు నిర్వహించిన వారు 15న, 14, 17న విధులు నిర్వహించిన వారు 18వ తేదీన ఆన్ డ్యూటీ కి అర్హులు. అదే విధంగా 11, 14, 17న మూడు దశల్లోనూ విధులు నిర్వహించిన వారు 15, 18న ఆన్ డ్యూటీ కి అర్హత పొందుతారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన సిబ్బందికి ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించడం పట్ల ఎంప్లాయ్ జేఏసీ చైర్మన్ టిఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాళీ చరణ్, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## గెలిచిన సర్పంచులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన సుడా చైర్మన్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాలలో గెలిచిన సర్పంచ్ ల వద్దకే సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్వయంగా వెళ్లి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గత పది రోజులుగా ఎప్పటికప్పుడు వారి గెలుపుకోసం పాటుపడడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేసే విధంగా కృషి చేసి సుడా నిధుల ద్వారా చేస్తున్న అభివృద్ధితో పాటు రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి వారి గెలుపుకు సహకరించిన సుడా చైర్మన్ కు సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచులతో పాటు ఇతర సర్పంచులను సైతం కలిసి వారిని శాలువాతో సత్కరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సుడా చైర్మన్ సన్మానం చేసిన వారిలో బోగొండ అయిలయ్య చామన్‌పల్లి,కూర నరేష్ రెడ్డి చర్లభూత్కూర్, మోతె ప్రశాంత్ రెడ్డి దుబ్బపల్లి, గుర్రం సంధ్య తిరుపతి బహదూర్ ఖాన్ పేట్, విజయలక్ష్మి ఫకీర్ పేట్, మల్లేశం చేగుర్తి, అంజయ్య యాదగిరి ఉన్నారు.

## తండ్రి వార్డు సభ్యుడు, తనయుడు ఉపసర్పంచ్

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో తనయుడు ఉప సర్పంచ్ గెలువగా, తండ్రి వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యాడు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడతలో ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో ఎన్నికలు జరిగాయి. ఇందులో తనయుడు ప్రశాంత్ గౌడ్ వార్డు మెంబర్‌గా గెలిచి, మిగతా వార్డు మెంబర్ల మద్ధతు ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. ఇది ఇలా ఉంటే ఇదే గ్రామ పంచాయతీ నుంచి తన తండ్రి దామోదర్ గౌడ్ వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యాడు. ఒకే కుటుంబం నుంచి తనయుడు, తండ్రి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందడం పట్ల కుటుంబంలో సంతోషం వెల్లివిరియగా, పలువురు అభినందనలు తెలిపారు.

# ఢిల్లీలో ఏఐసిసి ఆఫీసు ముట్టడిలో పాల్గొన్న బిసి జెఏసి రాష్ట్ర కన్వీనర్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణయ్య ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో ఏఐసీసీ ఆఫీసు ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ తాళ్లపల్లి మనోజ్ గౌడ్ మాట్లాడుతూ తక్షణమే సర్పంచ్ ఎలక్షన్స్ రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఎన్నికలకు వెళ్లాలని రాహుల్ గాంధీ తన హామీని నిలబెట్టుకోలేక తెలంగాణ ప్రజల్ని వంచిస్తున్నారని అన్నారు. ఓటు చోరీ అయిందని బిజెపి పార్టీని నిందిస్తూ సీటు చోరీ తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేస్తుందని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిజెపి కాంగ్రెస్ ప్రజలను మంచించడంలో గత 50 ఏళ్లలో బీసీలకు ఏ రోజు న్యాయం చేయలేదని అన్నారు. ఇప్పటికైనా రాహుల్ గాంధీ స్పందించి తెలంగాణలో సీటు చోరీని ఆపాలని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తో న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. ఏఐసీసీ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం తెలుసుకున్న కాంగ్రెస్ అధిష్టానం బీసీ సంఘాల నాయకులను కట్టడి చేయనికి రెండు మూడు వందల పైచిలుకు బలగాలను పెట్టి ప్రజల హక్కులను కాపాడే ఉద్యమ నాయకులను ఢిల్లీలో నిలువరించారు. అరెస్టు చేయడం నాయకులను భయభ్రాంతులకు గురి చేయడం వారి చేతగానితనానికి నిదర్శనంఅన్నారు.ఈ అరెస్టులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని బీసీ ఉద్యమ తొలి అమరుడు ఈశ్వర చారిగారి 42 శాతం రిజర్వేషన్ సాధించుకునే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ర్యాగ అరుణ్ బాబు, బిసి జేఏసీ కన్వీనర్ తాళ్ళపల్లి మనోజ్ గౌడ్, ఆది మల్లేశం పటేల్, తాడూరి శ్రీమన్నారాయణ, కోమటిపల్లి రాజేందర్, నర్సింగోజు శ్రీనివాస్, అనంతయ్య, పద్మ, 200 మంది బిసి సంఘం నాయకులు అరెస్టు చేసి స్థానిక అక్బర్ రోడ్డు పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా!

**ప్రజాపక్షం/బీర్పూర్ :** బీర్పూర్ గ్రామ ప్రజలు ఆశీర్వదించి సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని సర్పంచ్ అభ్యర్థి ఏలా మట్ల హరీశ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో సర్పంచ్ ఎన్నికలకు ఈనెల 14 పోలింగ్ జరుగుతుండగా శుక్రవారం రోజున ఏలామాట్లా హరీష్ కి మహిళలు యువకులు వృద్ధులు అన్ని వర్గాల ప్రజలు వార్డు సభ్యుల అభ్యర్థులు వెంటరాగ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి హరీష్ మాట్లాడుతు సర్పంచ్ గా గెలిపిస్తే బీర్పూర్ మండల కేంద్రంలోని అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పెన్షన్స్ ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని అన్నారు. మన మండలాన్ని ఒక మోడల్ గా మారుస్తానని ఊరిలో కావాల్సిన సిసి రోడ్లు మురికి కాలువలు వీధి దీపాలు ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు ఒక్కసారి అవకాశం ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపిస్తే మీకు ఏ సమస్య ఉన్న తీరుస్తానని అన్నారు.మీ అమూల్యమైన ఓటు ఉంగరం పై వేసి గెలిపించాలని కోరారు.

## గ్రామాలలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ పరిధిలో ఈనెల 17న జరగనున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వుల మేరకు డిఎస్పీ రఘుచందర్ సూచనలతో ధర్మపురి సిఐ ఎలిపాటి రాం నర్సింహారెడ్డి, ఎస్సై గురుక మహేష్ ల ఆధ్వర్యంలో శుక్రవారం నేరెళ్ల,రాయపట్నం గ్రామాలలో 50 మంది పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు పి.ఉదయ్ కుమార్( వెల్గటూర్),కృష్ణ సాగర్ రెడ్డి (గొల్లపల్లి),సతీష్ (బుగ్గారం),రవీందర్ కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 6వ వార్డులో హోరాహోరీగా వార్డు సభ్యుడి ఎన్నిక

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల వ్యాప్తంగా రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. కాగా గుండంపల్లి గ్రామంలో ఆరో వార్డులో నలుగురు అభ్యర్థులు పోటీ చేయగా హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి పాలేపు గంగారెడ్డి ప్రత్యర్థులపై 25 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు.గ్రామంలో ఒకే ఒక బీజేపీ అభ్యర్థి గెలవడం విశేషం.

## హామీలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నైజం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** హామీలను ఇచ్చి విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నైజం అని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున జూలపల్లి మండలంలోని పెద్దాపూర్, జూలపల్లి గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, ఎన్నికల ముందు ప్రజలకు కొండంత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల తరువాత వాటిని పూర్తిగా మరచిపోయిందని, అభివృద్ధి అంటే పత్రికల్లో ఫోటోలు కాదని గ్రామాల్లో కాలనీల్లో కనిపించాలని, రెండు సంవత్సరాలు గడిచినా ఒక హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు.కేవలం మాటలతో మభ్యపెట్టడం, ప్రజలను మోసగించడం కాంగ్రెస్ పార్టీ నైజం. మన గ్రామాల అభివృద్ధి, మన పిల్లల భవిష్యత్తు, మన హక్కులు కాపాడాలంటే బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలనీ, ఆరు గ్యారెంటీలు నిజంగా అమలు కావాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులే సరైన వారిని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఓటు అడిగే ముందుమహిళలకు నెలకు 2500, వృద్ధాప్య పెన్షన్ 4000, వికలాంగులకు నెలకు 6000,కల్యాణ లక్ష్మి కి తులం బంగారం,గత రెండు సంవత్సరాలకు మహిళలకు 60,000, పెన్షనర్లకు 48,000, వికలాంగులకు 48,000 బాకీగా ఉందని, అవి అర్హులకు చెల్లించిన తర్వాతనే ఓట్లు అడగాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రఘువీర్ సింగ్ , కరీంనగర్ కార్పొరేటర్ సతీష్,అనిల్, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసిలు, కో ఆప్షన్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒబిసి రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లుకు మద్దతు ఇవ్వండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఓబిసి రిజర్వేషన్ల సాధనలో భాగంగా బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రామచంద్ర రాజ్యసభలో ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లుకు మద్దతుగా ఇండియా కూటమి ఎన్ డి ఏ ఎంపీలను కలిసి ప్రవేటు బిల్లుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ తో పాటు మనోజ్ గౌడ్ కోమటిపల్లి రాజేందర్ నర్సింగోజు శ్రీనివాస్ లు తెలిపారు. శుక్రవారం రోజున జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపుమేరకు ఓబీసీ రిజర్వేషన్ల సాధన లో భాగంగా న్యూఢిల్లీలో పలువురు పార్లమెంటు సభ్యులను కలిసిన వారిలో గడ్డం వంశీకృష్ణ ఆర్య కృష్ణయ్య అంబికా లక్ష్మీ నారాయణ వీర మస్తానాయ వద్దిరాజు రామచంద్రరాజు పార్థసారథి పాక సత్యనారాయన నాగరాజు లను కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్లో చట్టం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దేశ జనాభాలో 80 కోట్ల పై పడగలిగిన 80 కోట్ల పైబడి ఓబీసీ జనాభాకు మంత్రిత్వ శాఖ లేకపోవడం సోషనీయమని వారు పేర్కొన్నారు కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీలకు మంత్రిత్వ శాఖ ఆవశ్యకత పై పార్లమెంటు సభ్యులకు వివరించినట్లు తెలిపారు.బిసి రిజర్వేషన్ల సాధనలో 42 శాతం అమలు కాకపోవడం పై కలత చెంది సాయి ఈశ్వర చారి ఆత్మ బలిదానాన్ని పార్లమెంటు సభ్యులకు వివరించినట్లు తెలిపారు పార్లమెంటు సభ్యులు సహకరిస్తే దేశంలో ఓబీసీ ఉద్యమం ఉధృతంగా మారి మరో సంపూర్ణ బీసీ విప్లవం రానున్నదని పార్లమెంటు సభ్యులు వివరించినట్లు తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు.

## అనుక్షణం భద్రతతో విధులు నిర్వహించాలి




**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఈనెల 8 నుండి 20 వరకు నిర్వహిస్తున్న 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాలను పురస్కరించుకొని రామగుండం3 ఏరియా లోని ఓసిపి1 ఉపరితల గనిలో భద్రతా తనిఖీ బృందం కన్వీనర్ సిహెచ్. వెంకటరమణ, సభ్యులు పర్యటించారు. వారికి ముందుగా ప్రాజెక్ట్ అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తనిఖీ బృందం కన్వీనర్ సి.హెచ్. వెంకట రమణ మాట్లాడుతూ ఉద్యోగులు భద్రతపై ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని, అనుక్షణం అప్రమత్తతో ఉంటూ భద్రతతో విధులు నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని అన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తూ సింగరేణి సంస్థను ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలని అన్నారు.తదుపరి రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ ఉద్యోగులందరికీ భద్రతపై అవగాహన కల్పించడం కోసం ప్రతి సంవత్సరం ఈ భద్రతా పక్షోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, అధికారులు, సూపర్వైజర్లు ఉద్యోగులకు భద్రత పట్ల మరింత అవగాహన కల్పించాలని కోరారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తనిఖీ బృందాన్ని, ఉద్యోగులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, గడ్డం తిరుపతి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫాంటింగ్, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉదయ్ భాస్కర్, మేనేజర్ రావుల పాపయ్య, .సాంబయ్య, టి.సత్య కిరణ్, బి.వెంకట్రామ్, సేఫ్టీ కమిటీ సభ్యులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలోని సేవలను వినియోగించుకోవాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని సేవలను వినియోగించుకోవాలని జిల్లాని అధికారి సునీత కుంచాల అన్నారు. శుక్రవారం రోజునపెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె శ్రీధర్ తో కలిసి లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ ప్రారంభించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న సేవలు గురించి సూపరింటెండెంట్ ని అడిగి తెలుసుకొని ఆస్పత్రిలోని సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవలను వినియోగించుకోవాలని, పేద ప్రజలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## జేగ్గిశెట్టి శ్రీనివాసును గెలిపించండి

**ప్రజాపక్షం/బీర్పూర్ :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో శుక్రవారం రోజున గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి జేగ్గీ శెట్టి శ్రీనివాస్ ను గెలిపించాలని డాక్టర్ భోగా శ్రావణి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది అని గ్రామాల్లో స్ట్రీట్ లైట్స్ డ్రైనేజ్ లు సిసి రోడ్ ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి అనేక అభివృద్ధి పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు గ్రామంలోని మహిళలు యువకులు ప్రజలు అందరూ కలిసికట్టుగా బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి అయినటువంటి జేగిశెట్టి శ్రీనివాస్ కి బ్యాట్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీర్పూర్ బిజెపి మండల శాఖ అధ్యక్షుడు నర్సయ్య, మాజీ సర్పంచ్ ఘర్షకుర్తి శిల్పా రమేష్, బందారి రవి ,సుభాష్, నాగరాజు, చిన్నయ్య, మహేష్ , గణేష్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షా కేంద్రం వద్ద నిషేధాజ్ఞలు

**ప్రజాపక్షం /ధర్మపురి :** ఈనెల 13 శనివారం రోజున జరుగనున్న జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష కేంద్రం వద్ద జిరాక్స్ కేంద్రాలు బంద్ పాటించాలని ధర్మపురి తహశీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ సెలెక్షన్ టెస్ట్ జరుగనున్నందున కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకూ నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలోని జిరాక్స్ సెంటర్లు ఖచ్చితంగా మూసివేయాలని, ఆదేశాలని తప్పని సరిగా పాటించి,శాంతియుతంగా పరీక్ష నిర్వాహణకు సహకరించాలని తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

## ప్రముఖ వ్యాపారవేత్త ఏఏ నయీముకు పరామర్శ

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త బీడీ లీవ్ కాంట్రాక్టర్, ఎన్.ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ఏ.ఏ.నయీమ్ ను వారి నివాసం లో కోరుట్ల మైనార్టీ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పరామర్శించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ వారు మాట్లాడుతూ సామాజిక సేవలో ముందుండే ఏ.ఏ.నయీమ్ కుమార్తె ఇటీవలే హఠాత్తుగా మరణించడం చాలా బాధాకరమని, వారి కుమార్తె ఆత్మకు శాంతి చేకూర్చి, స్వర్గంలో స్థానం కలగాలని, వారి కుటుంబ సభ్యులకి ఆ దేవుడు మనోధైర్యాన్ని కల్పించాలని, దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడు వీరి కుటుంబ సభ్యుల పై ఉండాలని ప్రార్థించారు. కోరుట్ల మైనార్టీ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం గౌరవ అధ్యక్షులు సలీం ఫారుఖి,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నవాబ్ అలీ, అధ్యక్షులు మహమ్మద్ చాంద్ పాషా,ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ, కోశాధికారి నజీబుల్లా, సీనియర్ పాత్రికేయులు మునవీర్,యూసుఫ్, యూనుస్ సాదిక్ ,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు తదితరులు పరామర్శించారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు ఎస్సై అశోక్

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని లోకేశ్వరం ఎస్సై అశోక్ అన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద 100 నుంచి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని,ప్రజలు గుంపులుగా గుమిగూడకూడదని సూచించారు.పోలింగ్ కేంద్రాల లోపల మొబైల్ ఫోన్లు,నీటి సీసాలు,మసి సీసాలు, పెన్నులు, ఆయుధాలు వంటి వస్తువులకు అనుమతి ఉండదని తెలిపారు.క్యూ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంట వరకు ఓటర్లకు ప్రవేశం ఉంటుందని చెప్పారు.సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే లేదా గొడవలకు దారి తీసే సందేశాలు పంపిణ వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఎవరైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.ఎన్నికల అనంతరం అదే రోజు విజయోత్సవ ర్యాలీలు,టపాకాయల పేలుళ్లు చేయరాదని,సంబంధిత అధికారుల అనుమతితో నిర్ణయించిన రోజు మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు పోలీసులు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఎస్సై అశోక్ పేర్కొన్నారు.



# సర్పంచ్ నవీన్ యాదవ్‌ను సన్మానించిన జాన్సన్ నాయక్

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కుల నవీన్ యాదవ్‌కు శుక్రవారం బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ శాలువాతో సన్మానించారు.



మొదటి విడత స్థానిక ఎన్నికల్లో భాగంగా బీర్నంది గ్రామ సర్పంచ్ గా గురువారం జక్కుల నవీన్ యాదవ్ విజయం సాధించారు.ఉప సర్పంచ్ గా రాగుల రాకేష్ ఎన్నుకోగా సర్పంచ్,ఉప సర్పంచ్‌లు శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్ ను ఖానాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జాన్సన్ నాయక్ సర్పంచ్, ఉప సర్పంచ్ లకు అభినందనలు తెలిపి ,శాలువాతో సన్మానించారు.ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు.

## మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / చెన్నూరు :** ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన చెన్నూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు చేరువలో వేగవంతమైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం ఈ ఆసుపత్రిని నిర్మిస్తోందని తెలిపారు. గుత్తేదారులతో సమన్వయం చేసుకుంటూ, నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేలా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి, ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మామడ,లక్ష్మణచందా మండల నూతన ఎన్నికైన సర్పంచులకు సన్మానం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల నమ్మకానికి నర్పంచ్ ఫలితాలు నిదర్శనంగా నిలిచాయని నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు అన్నారు.మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన మామడ,లక్ష్మణచందా,మండలంలోని సర్పంచులను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందించారు.మొదటి విడత ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే వి జయం సాధించారని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల ప్రజాపాలన సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని అన్నారు. పల్లి సర్పంచ్ సోనియాసంతోష్,గోల్డ్ కూడా మూ తి బాయ్,అనంతపేట తిరుమల్,కిషన్‌రావు పేట వసంతరావు,న్యూ లిం గంపల్లి సర్పంచ్ బీమా గంగన్న,రాయదారి సర్పంచ్ బంక తిరుపతి,వడ్యాల్ సర్పంచ్ పసుపుల నరేష్ లను శాలువా తో మాజీ జెడ్పిటిసి మంగ్య నాయక్ తదితరులున్మానించారు.వివిధ మండల పార్టీ అధ్యక్షుడు వడ్నాల రాజేశ్వర్ మాజీ ఎంపీపీ నరేష్ రెడ్డి,కమలాకర్ రావు, సంతోష్ రాథోడ్,మాజీ జెడ్పిటిసి మంగ్య నాయక్ పాల్గొన్నారు.





# వాహనాల తనిఖీ చేసిన ఎఫ్.ఎస్.టి టీం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మండల కేంద్రంలోని ఎఫ్.ఎస్.టి,పోలీస్ సిబ్బంది సర్పంచ్ ఎలక్షన్ సందర్భంగా కాండ్లి ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఫ్.ఎస్.టి టీమ్ మాట్లాడుతూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ మద్యం,డబ్బులు తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలిపారు.రాథోడ్ సురేష్,రాజేశ్వర్,శంసున్ పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి దిశానిర్దేశం

**ప్రజాపక్షం / రెబ్బెన :** రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెబ్బెన మండలం గోలేటి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకుడు అజ్మీరా బాబురావును, వార్డు సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవ లక్ష్మి పిలుపునిచ్చారు. గోలేటి లోని టిబిజికెఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కోవ లక్ష్మి మాట్లాడుతూ గోలేటి గ్రామ సమగ్రాభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల విజయం అత్యవసరమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని సూచించారు. కార్యకర్తల కృషి, అంకితభావంపై తనకు నమ్మకం ఉందని, అజ్మీరా బాబురావుతో పాటు వార్డు సభ్యులందరూ కచ్చితంగా భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే ధీమాను ఆమె వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రెబ్బెన బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి, టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస రావు, నాయకులు వెంకటేశ్వర్లు, కిరణ్, మాజీ సర్పంచులు తోట లక్ష్మణ్, సుమలత, నాయకులు పంబల శ్రీనివాస్, అసిఫ్ అలీ, వెంకటస్వామి, దయాకర్, కుమారి, మల్లేష్, లచ్చు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ముస్లిం కమిటీ సన్మానం



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన మహమ్మద్ నయీమ్‌తో పాటు వార్డు సభ్యులను జామా మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు నూతన ప్రజా ప్రతినిధులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. తమపై నమ్మకంతో ప్రజలు తమను గెలిపించినందుకు వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ మహమ్మద్ నయీమ్, వార్డు సభ్యులు మహమ్మద్ అథర్, అక్తరీ బేగం, నాగేందర్ మరియు ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్‌గా బండారి సూరిబాబు

**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు మందమర్రి పట్టణ బిఆర్ఎస్ కమిటీ సెక్రటరీ జనరల్‌గా బండారి సూరి బాబు నియమితులయ్యారు. పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు జె. రవీందర్, సీనియర్ నాయకులు, టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఇతర యూనియన్ నాయకులు సూరిబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సూరిబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజలకు మరింత చేరువయ్యేలా సేవలు అందిస్తానని తెలిపారు. నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

# నస్పూర్‌లో ఉత్సాహంగా మహిళలు, పిల్లల క్రీడా పోటీలు




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని సిఇఆర్ క్లబ్‌లో మహిళలు, పిల్లల కోసం వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలకు బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్ పోటీలను, పిల్లలకు 50 మీటర్ల రన్నింగ్ రేసులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమారాణి శ్రీనివాస్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇంత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం ఎంతో ఆనందకరమన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నస్పూర్, శ్రీరాంపూర్ కాలనీల్లో మహిళలు, పిల్లల కోసం మరిన్ని ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 23వ తేదీన జరిగే ఆవిర్భావ దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సీనియర్ పిఓ ఎస్. సురేందర్, ఏఐటియుసి నాయకులు కొట్టే కిషన్ రావు, స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ సురేష్, సేవా సెక్రటరీ జ్యోతి, సభ్యులు శారద, సునీత, రజిత, శిక్షకులు, అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# జన్నారం నూతన సర్పంచ్‌గా కళావతి నందు నాయక్

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం గ్రామ పంచాయతీలో జరిగిన మొదటి విడత ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి కళావతి నందు నాయక్ విజయం సాధించారు. ఆమె తన సమీప ప్రత్యర్థులపై గెలుపొంది జన్నారం నూతన సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కళావతి నందు నాయక్ మాట్లాడుతూ జన్నారం గ్రామాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని స్పష్టం చేశారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని పేర్కొన్నారు.



# జిల్లా వాసుల ముంగిటకే పోర్టబుల్ ఎక్స్‌రే సేవలు

## కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ. 23 లక్షల వ్యయంతో సమకూర్చుకున్న 'పోర్టబుల్ ఎక్స్ రే' మిషన్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం ప్రారంభించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్. అనితతో కలిసి ఆయన ఈ పరికరాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర క్షయ నియంత్రణ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ అత్యాధునిక పరికరం ఎఐ టెక్నాలజీతో పని చేస్తుందని, పరీక్ష చేసిన వెంటనే రిపోర్టు రోగికి, సమీప పిహెచ్‌సి వైద్యులకు చేరుతుందన్నారు. దీనివల్ల ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో నివసించే దాదాపు లక్షా 76 వేల మందికి పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, బరువు తక్కువ ఉన్నవారు, హెచ్ఐవీ బాధితులు, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు ప్రాధాన్యతనిస్తూ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ మిషన్ నిర్వహణ కోసం ఒక సాంకేతిక నిపుణుడు, ఒక సూపర్వైజర్ అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సమన్వయకర్త సురేందర్, డీపీవో ప్రశాంతి పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి సత్తా

## జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో ఐదు స్థానాలు కైవసం

**ప్రజాపక్షం/ఎడపల్లిం:** తెలంగాణలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సమరంలో సాంస్కృతిక సంస్థ తెలంగాణ జాగృతి తనదైన ముద్ర వేసింది. కేవలం కేవలం సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, తొలి విడత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తన ఉనికిని చాటుకుంది. నిజామాబాద్ జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి బలపర్చిన అభ్యర్థులు సత్తా చాటారు. ఐదుగురు ఘన విజయం సాధించి, సర్పంచ్ పీఠాలను కైవసం చేసుకోవడం ద్వారా సంస్థ ఎన్నికల ఖాతాలో బోణీ కొట్టింది. మండలంలోని తాడ్ బిలోలిలో శంకర్, తారాచం ద్, వీరన్నగుట్ట తండాలో సుమలత జాదవ్, నవీపేట్ మండలంలోని కమలాకర్ లు గెలుపొందారు.

# గెలిస్తే పుట్టిన ఆడబిడ్డ అకౌంట్‌లో ఐదు వేలు

## బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి సర్పంచ్ సుంకరి లక్ష్మీ గాంధీ



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని పురాణీపేట్ సమగ్రాభివృద్ధి కోసం ఆశతో కాకుండా ఆశయంతో పని చేస్తానని సర్పంచ్ అభ్యర్థి సుంకరి లక్ష్మీ గాంధీ అన్నారు. శుక్రవారం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి అనునిత్యం అందుబాటులో ఉంటూ సంకల్పంతో మీ ముందుకు వస్తున్నానన్నారు. గ్రామప్రజలు, పెద్దలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెలు, యువత, మిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ ఆశీర్వదించాలని కోరారు. గ్రామాభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలు ఇచ్చే విశ్వాసం, మద్దతుతో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని పురాణీపేట్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌గా బలపర్చిన తనకు సర్పంచ్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామప్రజలతో కలిసి గ్రామాభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ గ్రామంలో సర్పంచ్‌గా గెలిచిన వెంటనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తానని, అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణం, విలేజ్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేయించటం జరుగుతుందన్నారు. నిరుపేద ఆడబిడ్డకు పెళ్లికి తన వంతు సాయంగా రూ.10000 ఇస్తానని హామీనిచ్చారు. గ్రామంలో ఎక్కడైనా నీటి సమస్య పరిష్కారం, విద్యుత్ సమస్యపై దృష్టి సారించటం జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ప్రజలకు హామీనిచ్చారు. గెలిపించిన వెంటనే భగీరథ నీటిని కూడా పరిష్కారిస్తానని హామీ మీ అమూల్యమైన ఓటు లేడీ పర్సు గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# పల్లె పోరులో కాంగ్రెస్ జోరు

## ఉత్కంఠలో కొలువుదీరిన కొత్త సర్పంచులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో గ్రామ పంచాయతీలో ఎన్నికలు సాఫీగా కొనసాగినా ఫలితాలు మాత్రం ఉత్కంఠగా సాగాయి. ఒకచోట చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో చలి అధికంగా ఉండటంతో ఉదయం పది గంటల తరువాత ఓటర్లు తమ ఓటుని వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎడపల్లి, జాన్కంపేట్, అంబం, మంగళ్పాహాడ్, నెహ్రూనగర్ ఏఆర్పీ క్యాంప్ గ్రామాలలో కౌంటింగ్ ఉత్కంఠగా సాగింది. జాన్కంపేట్ లో అత్యధికంగా కాంగ్రెస్ అభ్యర్థి సుంచనకోట అనురాధతో పాటు ఏడుగురు బరిలో నిలువగా గ్రామ సర్పంచ్ ఫలితాలు రాత్రి 12గంటల వరకు కొనసాగింది. కాంగ్రెస్ అభ్యర్థి సుంచనకోట అనురాధ రాధా కిషన్ గౌడ్ సమీప అభ్యర్థి అనుప పై 125ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. ఎడపల్లి మండలంలో 17గ్రామ పంచాయతీలకు గాను ఒక్క బాపునగర్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవం అ య్యింది. మిగతా గ్రామాల్లో 12మంది కాంగ్రెస్, ముగ్గురు బిజెపి, ఒక్క బిఆర్ఎస్, ఒక్క ఇండిపెండెంట్ పార్టీల మద్దతు దారులు గెలుపొందారు. అంబం(వై)లో గోపరి స్రవంతి, ఇండిపెండెంట్ సమీప అభ్యర్థి విజయలక్ష్మీ పై 40ఓట్ల తేడాతో గెలుపొందారు. ఏఆర్పీ క్యాంప్‌లో పురుమల వినోద్, మహమూద్ పై 22ఓట్లతో గెలుపొందారు. బ్రహ్మణపల్లిలో పురమల హన్మంతు, దినేష రెడ్డిపై 124ఓట్ల తేడాతో గెలుపొందారు. ధర్మారంలో సుండు కిషన్, సుండు నర్సయ్యపై 203ఓట్ల తేడాతో గెలుపొందారు. దుబ్బ తండాలో మంగ్యా, రమేష్‌పై 60 ఓట్ల తేడాతో గెలుపొందారు. జైతాపూర్ లో రాజు గౌడ్ సమీప అభ్యర్థి శ్రీకాంత్‌పై 677 ఓట్ల తేడాతో గెలుపొందారు. జమ్లంలో దొడ్డి శ్రీనివాస్, ఇర్వాన్‌పై 194ఓట్ల తేడాతో గెలిపించారు.కుర్నాపల్లిలో పరిగె సాయిలు, రవీందర్ గౌడ్‌పై వంద ఓట్ల తేడాతో గెలుపొందారు. మంగల్‌పహాడ్ చేపూరి వీణ, వనజ పై 52ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎమ్మెస్సీ ఫారంలో నోముల జయశ్రీ సమీప అభ్యర్థిపై 40ఓట్ల తేడాతో గెలుపొందారు. నెహ్రునగర్‌లో ముస్కాన్, ఆజ్మీర బేగంపై 415ఓట్ల తేడాతో గెలుపొందారు. పోచారంలో నీరడి జ్యోతి, బందారం సుమలత పై 154ఓట్ల తేడాతో గెలుపొందారు. ఠానాకలాన్‌లో గెంట్ అలేఖ్య సమీప అభ్యర్థి ఆకుల లావణ్యపై 104ఓట్ల తేడాతో గెలుపొందారు. వడ్డేపల్లిలో కొమ్మేటి సత్యం, సమీప అభ్యర్థి ఎరుపుల శ్రీనివాస్‌పై 57ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎడపల్లిలో కందగట్ల రామచందర్, శంకర్ నాయుడు పై 200ఓట్ల తేడాతో గెలుపొందారు.ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీ, ఇండిపెండెంట్ నాయకులు, గ్రామ ప్రజలందరూ ఉత్కంఠంగా జాన్కంపేట్ గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల కోసం అర్ధరాత్రి 12గంటల వరకు ఎదురు చూశారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాధాకిషన్ గౌడ్ సతీమణి సుంచనకోట అనురాధ బరిలో నిలిచారు.



# బోధన ప్రమాణాలు మెరుగుపరచాలి

## మండల విద్యాధికారి పద్మజ



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** విద్యార్థులకు మెరుగైన బోధన ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించాలని నస్పూర్ మండల విద్యాధికారి పద్మజ సూచించారు. శుక్రవారం ఆమె తీగల్‌పహాడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల హాజరు పట్టికలు, రికార్డులు, మధ్యాహ్న భోజన నాణ్యత, మౌలిక సదుపాయాలను ఆమె పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించి, వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించేందుకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, బోధనలో నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిర్యాణిలో బిజెపి విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం / తిర్యాణి :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. స్థానిక నాయకపుగూడ పంచాయతీ నుండి తిర్యాణి, సుంగాపూర్ వరకు ఇంటింటికీ తిరుగుతూ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు సారా రమేష్ గౌడ్, జిల్లా నాయకులు ఆత్రం గోపాల్ మాట్లాడుతూ స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ బిజెపి బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయాల్సిన ఆవశ్యకత ఉందని, అందుకోసం కమలం గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు.మండల ప్రధాన కార్యదర్శులు గాయంగి తిరుపతి, వల్క శ్రీధర్, బిసి మోర్చా మండల అధ్యక్షుడు రంగు అరుణ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు మదవి సీతారాం, ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు కనక హనుమంత్ రావు, బూత్ అధ్యక్షులు కొట్నాక ప్రవీణ్, ఆత్రం సంతోష్, మంగ రాజేష్‌పాల్గొన్నారు.

# వైభవోపేతంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆరట్టు ఉత్సవం శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి ఉరేగింపు జరిపారు. ఈ ఉత్సవ ఉరేగింపును బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఉరేగింపు రాకాసిపేట్ మీదుగా పట్టణ శివారులోని పసుపువాగు వరకు కొనసాగింది. పసుపు వాగును పంపా నదిగా భావిస్తూ అయ్యప్ప స్వామి విగ్రహాన్ని అందులో జలకలాడించారు. ఉరేగింపులో అయ్యప్ప స్వాములు ఒళ్లంతా రంగులు పూసుకొని తలకు బెలూన్లు కట్టుకొని నృత్యాలు చేశారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి అభిషేకాల అనంతరం పడిపూజ చేశారు. అనంతరం స్వాములు, భక్తులకు భిక్ష నిర్వహించారు. తిరుమల రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కృష్ణారెడ్డి, ఓంకార్ రెడ్డి, నల్లమోకు వశిష్ట బిక్ష దాతలుగా వ్యవహరించారు. ఆరట్టు ఉత్సవంలో బోధన్ టౌన్ సిఐ వెంకట్ నారాయణ, అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు పల్లెంపాటి శివన్నారాయణ, కార్యదర్శి ఐఆర్ చక్రవర్తి, కోశాధికారి కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, ప్రతినిధులు పావుటూరి వెంకటేశ్వరరావు, విజయ కుమార్ గౌడ్, బ్రహ్మయ్య, గోవింద్ రెడ్డి, గురు స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



# నూతన గ్రామ సర్పంచులకు ఘన సన్మానం



– ప్రజాపక్షం/కోరుట్ల : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ జి.ఎస్ గార్డెన్ లో కోరుట్ల పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్,కొంతం రాజం ల ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గంలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్ లను,ఉప సర్పంచ్ లను, వార్డు మెంబర్ల లను ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఇట్టికార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడ కృష్ణారావు, కొమిరెడ్డి విజయ్ ఆజాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా గెలుపొందిన సర్పంచులను, ఉపసర్పంచులను,వార్డు మెంబర్లను,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు,కొమిరెడ్డి విజయ్ ఆజాద్ లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి శాలువాలతో సన్మానించారు.అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో 78 గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 44 స్థానాల్లో గెలుచుకోవడం జరిగిందన్నారు.కోరుట్ల మండలం తిమ్మాయిపల్లి, అయిలాపూర్, కల్లూరు, ధర్మారం, వెంకటాపూర్, చిన్న మెట్పల్లి, మోహన్ రావు పేట, వంటి కీలక గ్రామాలతో పాటు మెట్ పల్లి మండలంలోని వెల్లుల్ల, బండలింగాపూర్,రామలచ్చక్క పేట,జగ్గాసాగర్,మల్లాపూర్ మండలంలోని పాత దామరాజ్ పల్లి,గోధూర్, శ్రీరాంపూర్,వాల్గొండ తండా,నడి కొత్త ధార్మాజు పల్లి, ఇబ్రహీంపట్నంమండలం పకీర్ కొండాపూర్,వేముల కుర్తి,వంటి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం జరిగిందని, ఇందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు నిదర్శనం అన్నారు. వేంపేట గ్రామంలో గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం కాకుండా ఎల్లమ్మ గుడి వద్దకు రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారానే అక్కడ ప్రత్యర్థి అభ్యర్థులు ఎంత ఖర్చు పెట్టినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపొందడం అభినందనీయం అని అన్నారు. కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లి గ్రామంలో తల్లి కూతుర్ల మధ్య బిఆర్ఎస్ పార్టీ చిచ్చుపెట్టి తల్లిని బలవంతంగా పోటీ చేయించడం జరిగిందన్నారు.అయినా గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, పాల్గొన్నారు.

## శీలం సురేందర్‌ను గెలిపించి గ్రామ అభివృద్ధికి బాటలు వేయండి

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. ధరూర్ గ్రామ సర్పంచ్ గా ముగ్గురు నామినేషన్ దాఖలు వేశారు. ధరూర్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా గత ఇరవై ఏళ్లుగా గ్రామ ప్రజలకు అండగా నిలుస్తున్న శీలం సురేందర్ నామినేషన్ దాఖలు చేశారు. సర్పంచ్ అభ్యర్థిగా శీలం సురేందర్ నామినేషన్ వేసిన రోజు నుండి శుక్రవారం వరకు ధరూర్ గ్రామ నాయకులు, యువత, మహిళలు శీలం సురేందర్ కు మద్దతుగా ధరూర్ గ్రామ ప్రజలు అందరు గ్రామంలో ప్రచారం హోరెత్తించారు. పెద్ద సంఖ్యలో సురేందర్ కు మద్దతు ఇస్తూ తమ అమూల్యమైన ఓటును శీలం సురేందర్ కు వేసి సర్పంచ్ గా సురేందర్ గెలిపించి గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలని గ్రామ ప్రజలు ప్రచారం చేస్తున్నారు. ధరూర్ గ్రామ వాడ వాడ ఇంటి ఇంటికి వెళ్ళి గ్రామ ప్రజలను గ్రామ సర్పంచ్ అభ్యర్థి శీలం సురేందర్ బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మహిళలు అందరు పెద్ద ఎత్తున్న కదిలివెళ్ళి ప్రచారం చేయడం ధరూర్ గ్రామ చరిత్రలో ప్రత్యేకత సంచరించుకుందని పలువురు అభిప్రాయపడ్డారుఅభిప్రాయపడ్డారు.

## భరోసాగా ఉంటా గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టండి

ప్రజాపక్షం/మల్లాపూర్ : గురువారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులు గెలవడం సంతోషదాయకమని భరోసాగా ఉంటా గ్రామాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన సర్పంచులు శ్రీకారం చుట్టాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన చిట్యాల లక్ష్మ ణ్, రాఘవపేట సర్పంచిగా ఎన్నికైన తోట శ్రీనివాస్, రేగుంట సర్పంచ్గా ఎన్నికైన తీట్ల లహరి రాజేష్ లను శాల్వాతో సత్కరించి అభినందనలు తెలిపారు. వీరి వెంట బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ,తదితరులు ఉన్నారు.

## ప్రచారంలో పాలొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి



ప్రజాపక్షం/బీర్ పూర్: జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రోజునజీవన్ రెడ్డి మాట్లాడుతూ బీర్పూర్ మండలంలోని ప్రతి గ్రామంలో జీవన్ రెడ్డి చేసిన పని మాత్రమే ఉందిజగిత్యాల నియోజకవర్గానికి ఉత్తర ద్వారం తెరిచే విదంగా కమ్మునూర్ కలమడుగు బ్రిడ్జి వంతెన నిర్మాణం చేశానువైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా నేను రోడ్డు భవనాల శాఖ మంత్రిగా 40 కోట్ల రూపాయలతో బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చేశానుఆనాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి మండలానికి ఒక జూనియర్ కళాశాల మంజూరు చేస్తే ఉమ్మడి సారంగపూర్ మండలంలో 2 జూనియర్ కలశాలలు మంజూరు చేయడం జరిగింది.బీర్పూర్ మండలం కాకముందే బీర్పూర్ లో జూనియర్ కలశాల ఏర్పాటు చేశాను.బీర్పూర్ మండలం లోని ప్రతి గ్రామానికి త్రాగు నీటి సౌకర్యం కానీ సాగునీటి సౌకర్యం కల్పించబడేలా చొరవ తీసుకున్నాను .25 ఉన్న రోళ్లవాగు ప్రాజెక్టును ఆధునికీకరణ అనే నెపంతో 1.టీఎంసీ నీటి సామర్థ్యానికి పెంచి 60 కోట్లు ఉన్న ప్రాజెక్టును 120 కోట్లకు పెంచి ఇప్పటి వరకు రోళ్లవాగు ప్రాజెక్టు పనులను పూర్తి చేయలేకపోయారుగత పాలకులు గత పది సంవత్సరాల నుండి చేసిన అభివృద్ధి ఏంటి అని అన్నారు ఈ మాసంలో రోళ్లవాగు స్లూయిస్ గేట్లు బిగిస్తాం అని హామీ ఇచ్చారుగత ప్రభుత్వంలో రోళ్లవాగు కట్ట తెగితే రైతుల వేలాది ఎకరాల పొలాలలో ఇసుక మెట్టలు వేస్తే రైతులకు ఒక్క రూపాయి సహాయం లేదుమత్స్యకారుల కోట్లాది రూపాయల చేప రోళ్లవాగు తెగి కొట్టుకపోతే ఒక్క రూపాయి సహాయం అందించలేదు అని అన్నారుగత ప్రభుత్వంలో చెల్లని రూపాయి ఈ ప్రభుత్వంలో ఎలా చెల్లుతుంది అని అన్నారు.గత ప్రభుత్వంలో అభివృద్ధి చేయడం కాలేదు కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి నేను అభివృద్ధి చేస్తా అంటున్నారుఅభివృద్ధి చేసేది ఉంటే గత ప్రభుత్వంలో ఎందుకు చేయలేదు అన్నారు.కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేను అభివృద్ధి చేస్తా అంటున్నారు.ఎవరు పడితే వారు కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటున్నారు కానీ ప్రజలకు ఎవరు అసలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలో తెలుసు అన్నారు.సర్పంచ్ ఎన్నికలలో నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు జీవన్ రెడ్డి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని సూచించారుగ్రామాలలో ప్రతి పని త్రాగు నీరు సాగునీరు సౌకర్యాలతో పాటు ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారునరసింహుల పల్లె గ్రామంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించి గ్రామపంచాయతీ అంగన్వాడి లైబ్రరీ నిర్మాణం చేసుకునే విధంగా నేను చొరవ తీసుకుని చేపిస్తాను అని అన్నారు.రైతులకు గోదాం కూడా ఊరు సమీపంలో 10 గుంటల స్థలం సేకరించి గోదాం నిర్మాణం చేసుకునే విదంగా చొరవ తీసుకుంటాను అని అన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## రక్షణపై సింగరేణి కార్మికుల్లో అవగాహన



ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని సింగరేణి ఆర్జీ1 ఏరియా జిడికె 2, 2ఎ ఇంక్లెయిన్, సిఎస్‌పి1లో సింగరేణి స్థాయి 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తనిఖీ కన్వీనర్, ఎజీఎం(సీఎంసీ కార్పొరేట్) శ్రీనాథ్, ఆర్జీ జీఎం డి.లలిత్‌కుమార్‌లు హాజరై ఉద్యోగులకు రక్షణ సూత్రాలు, జాగ్రత్తల గురించి వివరించారు. రక్షణ జెండా ఎగురవేశారు. ఉద్యోగులు, కార్మికులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. రక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. బొగ్గు గనుల్లో కార్మికులు పనిచేసే ప్రదేశాలను తనిఖీ చేశారు. కార్మికులు తీసుకుంటున్న రక్షణ జాగ్రత్తలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీఎం(సేఫ్టీ) ఎస్.మధుసూధన్, అధికారులు కె.రాంమోహన్, జి.కృష్ణమూర్తి, చంద్రశేఖర్, సీఎంవోఏఐ ప్రతినిధి పొనగోటి శ్రీనివాస్, ఎఐటియుసి డిప్యూటి జనరల్ సెక్రటరి మడ్డి ఎల్లయ్యగౌడ్, అధికారులు సాయిప్రసాద్, డి.రమేష్, ఎస్.కె.అల్లాఉద్దీన్, డి.రమేష్, గాబ్రియెల్, సుధీర్ జక్కుల్‌వార్, గంగాధర శివప్రసాద్, హనుమన్‌గౌడ్, డాక్టర్ కారం పద్మ, తనిఖీ, రక్షణ కమిటి సభ్యులు, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

## అబాకస్ విద్యతో గణితం పట్ల ఆసక్తి పెరుగుతుంది

ప్రజాపక్షం/పెద్దపల్లి : అబాకస్ విద్యతో గణితం పట్ల ఆసక్తి పెరిగి విద్యార్థుల్లో ప్రావీణ్యం పెరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం రోజునపెద్దపల్లి విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో అబాకస్ & వేదాక్ మ్యాథ్స్ జిల్లా స్థాయి పోటీలు పెద్దపల్లిలోని నందన గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోని 40 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారనీ విశ్వం టీం సభ్యులు తెలిపారు.మొత్తం 500 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పరీక్షల్లో 31 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతుల విజేతలుగా ఎంపికయ్యారనీ, వీరు జనవరిలో జరిగే స్టేట్ లెవల్ పోటీల్లో పాల్గొంటారని విశ్వం ఎడ్యుకేషన్ రీజనల్ హెడ్ వినాయక్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శుక్రవారం విశ్వజనీన ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జడ్జి గణేష్ పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి పేషంట్లను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఎజిపి దూడం ఆంజనేయులు, లోక్ అదాలత్ సభ్యులు మాడూరి ఆంజనేయులు, రాజేంద్ర ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులు దక్షిణ రూపంలో ఇచ్చిన నగదును స్థానిక దేవాలయాలకు ఇవ్వండి

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : అయ్యప్ప మాలధారులు తమ దీక్షా కాలంలో, ఇరుముడి కట్టుకునే సమయంలో అయ్యప్ప స్వాములకు భక్తులు భక్తితో ఇచ్చే దక్షిణ రూపంలో ఇచ్చిన నగదును కేరళ లోని శబరిమల ఆలయంలోనీ హుండీ లో వేయడం వలన అక్కడి దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయి..అది కాకుండా ఇటీవల మన తెలుగు రాష్ట్రాల భక్తుల పై కేరళ వ్యాపారులు,కేరళ పోలీసులు దాడులు చేస్తున్నారు. కాబట్టి ఇక మీదట ఆ దక్షిణ డబ్బులు మన ఊరిలో ఉన్న దేవాలయాలకు, గోశాలకు,అనాథ ఆశ్రమం కు గాని వినియోగిస్తే మన ఊరు,మన గుడి అభివృద్ధి చెందుతాయని,ఇట్టి విషయాన్ని గురుస్వాములు తమ తోటి స్వాములకు వివరంగా చెప్పి మోటివేట్ చేయాలని సుంక శ్రీధర్ గురుస్వామి తమ తోటి స్వాములను కోరారు.

## బిఆర్ఎస్ కన్వీనర్లుగా అయ్యోరి రాజేష్, బండారి రంజిత్

ప్రజాపక్షం/ధర్మపురి : బీఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కన్వీనర్ గా అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ గా బండారి రంజిత్ లను నియమిస్తున్నట్లు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్,యువ నాయకులు ంజిత్ లు పంచాయతీ ఎన్నికల సందర్భంగా పార్టీ శ్రేణులను ముందుండి నడిపించాల్సిందిగా మాజీమంత్రి కొప్పుల సూచించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తా

ప్రజాపక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు అయిన ఇందిరానగర్ గ్రామ పంచాయితీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పూదూరి శ్రీలత రాజ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సింగిల్ విండో చైర్మెన్ ముప్పాల రామచంద్రరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ సహకారంతో నూతనంగా ఏర్పాటు అయినా ఇందిరా నగర్ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని అన్నారు. ప్రజలు కత్తెర గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి శ్రీలత రాజ్ కుమార్ నుగెలిపించాలని కోరారు.